క్లుప్తంగా

ఆర్మీ జవాన్‌గా ఎంపిక


భరత్

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రానికి చెందిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు తోళ్ల భరత్ ఆర్మీ జవాన్‌గా ఎంపికైయ్యాడు. ఆర్మీ జవాన్‌గా హ్యాండ్ బాల్ క్రీడాకారుడు ఎంపికవడం హ్యాండ్ బాల్ అసోసియేషన్‌కు గర్వకారణమని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం హర్షం వ్యక్తం చేశారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



మీర్జాపూర్ వైద్య సిబ్బందితో డాక్టర్ సంతోషి లత

హుస్నాబాద్‌రూరల్: కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర పర్యవేక్షకురాలు డాక్టర్ సంతోషిలత అన్నారు. మంగళవారం మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను, వైద్యులు చేపట్టిన కార్యక్రమాల వివరాలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి కుష్టువ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కుష్టు రోగులను గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, లోకేందర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణ నక్షత్ర మహోత్సవం


శ్రీ వేంకటేశ్వరుడికి లక్ష తులసీదళ నామార్చన చేస్తున్న వేదపండితులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో మంగళవారం శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చక వేదపండితులు తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అలంకార సేవ చేశారు. స్వామి వారి నామార్చన కొనసాగుతుండగా వేదవిద్యార్థులు, భక్తజనులు స్వామివారికి ఒక్కొక్కటిగా లక్ష తులసీదళాలు సమర్పించారు.

మూడు నెలలకోసారి హెల్త్ చెకప్

హుస్నాబాద్: పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న సఫాయి మిత్రులకు పట్టణంలోని బస్తీ దవాఖానలో మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ప్రతీ మూడు నెలలకోసారి హెల్త్ చెకప్ చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

బెజ్జంకి(సిద్దిపేట): సంక్షేమ పథకాలను పేదలకందించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి జక్కని సంజయ్ కుమార్ ఆరోపించారు. బెజ్జంకిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ ఇన్‌చార్జి వెంకన్నగౌడ్, పెద్దాల శ్రీనివాస్, ఉప్పలేటి శ్రీనివాస్, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్లలో..

సిద్దిపేటకమాన్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీల వాటా సాధిద్దామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయంలో చోరీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ శివారు పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడినట్లు బెజ్జంకి ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామస్తుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రోజులానే ఆలయంలో మైక్ సెట్ వేసేందుకు వెళ్లిన వ్యక్తి గుడిలో చోరీ జరిగినట్లు గుర్తించాడు. పెద్దమ్మ తల్లి మెడలోని బంగారు, వెండి ఆభరణాలు, ఆలయంలోని హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు.

ఆధార్ కోసం జనం ఇక్కట్లు

- ఆధార్ అప్‌డేట్ కోసం టెలీఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయానికి పరుగులు
- మురుగు పారుదలతో అవస్థలు


కేంద్రానికి వస్తున్న మహిళలు

హుస్నాబాద్: పట్టణంలోని టెలీకం ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం పరిసరాల్లో మురికి నీరు చేరడంతో మంగళవారం కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. టెలీకం ఎక్స్ఛేంజ్ కార్యాలయంలోకి మురికి కాలువల నుంచి మురుగు వస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు ఉద్యోగులు, ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చినవారు నానా అవస్థలుపడుతున్నారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో సరుకులు పొందాలంటే కేవైసీ చేసుకోవాలని నిబంధన పెట్టారు. దీంతో ఆధార్ అప్‌డేట్ కోసం కేంద్రానికి తరలివస్తున్నారు. కేంద్రానికి వచ్చే దారిలో మురుగు పారుతుండటతో ఎలా రావాలని కేంద్రానికి వచ్చినవారు ప్రశ్నిస్తున్నారు. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. మురికి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు పలు మార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో ఆధార్ నమోదు కేంద్రాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన జనం వెనుదిరిగి వెళ్తున్నారు. ఈ విషయంపై టెలీకం జేఈ కుమార్‌ను వివరణ కోరగా రెండు గంటలపాటు సాంకేతిక సమస్యతో ఇంటర్‌నెట్ పని చేయలేదని, దీంతో పాటు మురికి నీరు కార్యాలయంలోకి రావడంతో జనం ఇబ్బందులకు గురవుతున్నారని, మున్సిపల్ అధికారులకు చెబుతున్నారు పట్టించుకోవడం లేదన్నారు.

న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ వచ్చేలా చర్యలు

ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్

సిద్దిపేట ఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలకు న్యాక్ గుర్తింపు లభించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్‌తో కలిసి మాట్లాడారు. న్యాక్ బృందం అక్టోబర్‌లో కళాశాలను సందర్శించనున్నట్లు చెప్పారు. గతంలో కళాశాలకు ఏ గ్రేడ్ వచ్చిందని ఈ సారి ఏప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించేందుకు అవసరమైన అర్హతలను సంపాదించినట్లు చెప్పారు. న్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ గతంలో ఒకసారి బి గ్రేడ్, రెండు సార్లు ఏ గ్రేడ్ సాధించిందన్నారు. నాలుగో విడత న్యాక్ రీ అక్రిడేషన్ సందర్భంగా ప్రతీ అంశంపై ఆన్‌లైన్‌లో నివేదికలను సమర్పించినట్లు చెప్పారు. 80 శాతం ఆన్‌లైన్‌లో, 20 శాతం క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రేడ్‌ను అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాల సుదర్శనం, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


తిగుల్ గ్రామ చెరువులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు, నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ బాలేషంగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని తిగుల్ గ్రామంలో మహాసముద్రం చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసమే ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోందన్నారు. మండలంలోని చెరువులు, కుంటల్లో 4.80 లక్షల చేప పిల్లలను వదలడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇక్బాల్, సర్పంచ్‌లు భానుప్రకాష్‌రావు, సత్యం, రాజేశ్వరీ, లక్ష్మీ, లావణ్య, మమత, సత్యం, కుమార్, కనకయ్య, పావని, రజిత, బాలక్ష్మీ, ఎంపీటీసీలు రమ్య, కావ్య, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మత్స్యశాఖ జిల్లా అధికారి మల్లేశం, మండల అధికారి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ జయంతి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరు గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం అనుబంధ వివేకానంద విజ్ఞాన్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివేకానంద విజ్ఞాన్ సొసైటీ అధ్యక్షుడు పవన్, ప్రతినిధులు రంజిత్, అఖిల్, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రోల్ మోడల్ గజ్వేల్

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి


గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ నేతలకు గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని తూప్రాన్ రోడ్డులో అధునాతన హంగులతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషి వల్ల గజ్వేల్ నియోజకవర్గం నేడు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. కాంగ్రెస్ నేతలు అభివృద్ధిని కళ్లుండి చూడలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు గజ్వేల్ అభివృద్ధి కనిపిస్తలేదా?

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ నేతలకు గజ్వేల్ అభివృద్ధి కనిపిస్తాలేదా? సీఎం ప్రవేశపెట్టిన కంటి వెలుగులో కంటి పరీక్షలు చేయించుకొని అభివృద్ధిని చూడాలని బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు, ఎంపీటీసీ కవిత అన్నారు. మంగళవారం ఆమె జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రెండు పర్యాయాలు గజ్వేల్ నుంచి గెలిచి గజ్వేల్‌ను రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా అభివృద్ధి చేశారన్నారు.

పండుగలను ఘనంగా జరుపుకుందాం

హుస్నాబాద్: మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం పాలకవర్గ సభ్యుల సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఏటా జరుపుకునే చిన్న బతుకమ్మ, పెద్ద బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లకు రూ.11.98 లక్షలు, ఎల్లమ్మ చెరువు వద్ద వినాయక నిమజ్జన నిర్వహణకు రూ.99 వేలు కేటాయించాలని తీర్మానం చేశారు. అలాగే కాకతీయుల నాటి తూము సుందరీకరణ పనులకు రూ.25 వేలు కేటాయించాలని, వీటితో పాటు పలుఅంశాలపై చర్చించి పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపి తీర్మానం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

చాకలి ఐలమ్మ 128వ జయంతిని ఆయా నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. భూమి కోసం పోరాటం చేసిన గొప్ప వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆమె ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు.


గజ్వేల్‌లో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు


ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు


వర్గల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు


దుబ్బాకలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ గన్నె వనిత, కౌన్సిలర్ కల్పన


జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు


మర్కూక్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


కొండపాక(గజ్వేల్): దుద్దెడలో నివాళులర్పిస్తున్న నాయకులు


చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాధాకృష్ణ శర్మ తదితరులు


మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్టలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

సీపీ కార్యాలయంలో..


ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీ శ్వేత, పోలీసు అధికారులు

సిద్దిపేటకమాన్: చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి సీపీ శ్వేత నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లాఅండ్‌ఆర్డర్ మల్లారెడ్డి, ఏట యాదమ్మ, ఎస్‌బి సీఐ రఘుపతిరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ధరణి కుమార్, సీపీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చేది ఉపాధ్యాయులే


ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): సమాజాన్ని మార్చేది ఉపాధ్యాయులు మాత్రమేనని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. చిన్నకోడూరు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఎంఈఓ దేశిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ శ్రీనివాస్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. అన్నదానం

దుబ్బాక: పట్టణంలో మిత్ర యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి హాజరయ్యారు. యూత్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో వినాయక నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం ఆలయ అధికారులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


దుబ్బాకలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, చైర్‌పర్సన్ గన్నె వనితను సత్కరిస్తున్న మిత్ర యూత్ సభ్యులు


మర్కూక్(గజ్వేల్): పాములపర్తిలో అన్నదానం చేస్తున్న నాయకులు


బెజ్జంకిలో బోలేనాథ్ అసోసియేషన్ గణనాథుని వద్ద కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


అన్న ప్రసాదానికి పూజ చేస్తున్న ఆలయ అధికారులు, పూజారులు


గజ్వేల్‌రూరల్: నిమజ్జనానికి తరలివెళ్తున్న బొజ్జ గణపయ్య

సంక్షిప్త వార్తలు

◆ రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం

బెజ్జంకి(సిద్దిపేట): బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం వచ్చినపుడే సామాజిక న్యాయం లభిస్తుందని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ నాయకుడు లింగాల సురేశ్ అన్నారు. గడప గడపకు ధర్మ సమాజ్ పార్టీ పేరిట మంగళవారం మండలంలోని తోటపల్లిలో పాదయాత్ర ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి బలహీనవర్గాలకు వారి హక్కులను వివరిస్తున్నామన్నారు. సామాజిక న్యాయం కోసం పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

◆ చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తీగలకుంటపల్లి గ్రామంలో పోచమ్మ కట్టపై ఏర్పాటుచేసిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. విగ్రహ దాత జాలిగం రాజయ్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, ఉపసర్పంచ్ రాగుల రజిత, సంజీవరెడ్డి, రాజుముదిరాజ్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

తొగుట(దుబ్బాక): ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని తుక్కాపూర్ సర్పంచ్, బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల దీక్షలకు మంగళవారం సంఘీభావం తెలిపారు.

◆ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయం

మద్దూరు(హుస్నాబాద్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ దూళ్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాల మంజూరుతో పాటు దూళ్మిట్ట మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ దుబ్బుడు దీపిక, ఉప సర్పంచ్ పోతురాజు మధు, కురుమ సంఘం మండల అధ్యక్షుడు బర్మ రాజమల్లయ్య, మాజీ జెడ్పీటీసీ నాచగోని పద్మా తదితరులు పాల్గొన్నారు.

◆ డీజేలకు అనుమతి లేదు

హుస్నాబాద్: వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని సీఐ కిరణ్ హెచ్చరించారు. మంగళవారం హుస్నాబాద్ పోలీస్ సర్కిల్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లోని గణేశ్ మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈనెల 27, 28వ తేదీల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, నిమజ్జన కార్యక్రమం సక్రమంగా జరిగేందుకు సహకరించాలన్నారు. రాత్రి 10 గంటలలోపు నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ మహేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలు

మర్కూక్(గజ్వేల్): జాబ్ కార్డులు కలిగిన ఉపాధి కూలీలకు వంద రోజులు పని దినాలు కల్పిస్తామని, మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. మంగళవారం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై రెండో విడత సామాజిక తనిఖీ కార్యక్రమం మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ కౌసల్యాదేవి మాట్లాడుతూ దామరకుంట గ్రామంలో పని దినాలు ఎక్కువ కల్పించాలని సూచించారు.

◆ ఆర్థిక సాయం అందజేత

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన బైండ్ల శంకరయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.4 వేల ఆర్థిక సాయం అందించారు.

◆ సడక్ బందును జయప్రదం చేయండి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటంలో భాగంగా ఈనెల 29వ తేదీన సిద్దిపేట-జనగామ రహదారిపై ముస్త్యాల గ్రామంలో చేపడుతున్న సడక్ బందును జయప్రదం చేయాలని జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని వీరన్నపేటలో నిర్వహించిన సడక్ బంద్ ప్రచారంలో మాట్లాడారు. చేర్యాల ప్రాంత అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

◆ అన్నదానాలకు విరాళం

బెజ్జంకి(సిద్దిపేట): వినాయక నవరాత్రోత్సవాలను నిర్వహణకు బెజ్జంకికి చెందిన పలు యువజన, కుల సంఘాల నిర్వాహకులకు లక్ష్మీనృసింహ స్వామి ఉపాసకురాలు నెల్లుట్ల హరిప్రియ విరాళాలు అందజేస్తోంది. అన్నదానానికి రూ.10,116 అందజేసింది. మహిళలతో కలిసి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేస్తోంది.